క్లుప్తంగా

'బ్రౌన్'కు పుస్తకాల బహూకరణ



పుస్తకాలను అందజేస్తున్న నరాల రామారెడ్డి

కడప కల్చరల్ : ప్రముఖ అవధాని, కవి డాక్టర్ నరాల రామారెడ్డి కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి వెయ్యి పుస్తకాలను అందజేశారు. ప్రొద్దుటూరులోని తన స్వగృహంలోగల వ్యక్తిగత గ్రంథాలయానికి చెందిన ఈ పుస్తకాలను సోమవారం ఆయన స్థానిక ప్రముఖులు గజ్జల వెంకటేశ్వరరెడ్డితో కలిసి బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, గ్రంథ పాలకులు జి.హరిభూషణరావులకు అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కవిగా, అవధానిగా సుప్రసిద్ధులైన నరాల రామారెడ్డి వ్యక్తిగత గ్రంథాలయమంతా అత్యంత విలువైన సాహిత్య గ్రంథాలు ఉండడం సహజమని, వాటి నుంచి వెయ్యి పుస్తకాలను అందజేయడంతో బ్రౌన్ కేంద్రం విలువ మరింత పెరుగుతుందని కొనియాడారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాధవ రెసిడెన్సీ అధినేత గంగిరెడ్డి మాధవరెడ్డి, జయలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యుల సహకారంతో 500 మందికి అన్నదానం చేసినట్లు సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అవోపా భవన్‌లో యోగా గురువు మునిశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులను డాక్టర్ కృష్ణమోహన్ ప్రారంభించి మాట్లాడారు. నెల రోజులపాటు శిక్షణ ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవోపా అధ్యక్షుడు పద్మనాభయ్య, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజా, వరలక్ష్మి, కృష్ణమోహన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శేష వాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుక భాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారిని శేష వాహనంపై కొలువుదీర్చి తిరువీధులలో ఊరేగించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయాకర్పూరం సమర్పించారు. ఉదయం ఆలయంలో ధ్వజారోహణం, మహాకుంభ ఆరాధన, చతుస్థానార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారులు డా.వినీత్‌కుమార్‌రాజు, డా.ఉదయ్‌కిరణ్‌ల ఆధ్వర్యంలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేయు విధానం, వాడే విధానం, కలుగు ఉపయోగాలను తెలిపారు. 5 సంతవ్సరాల వయస్సు కలిగిన పిల్లలను గుర్తించి వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు 14 రోజుల పాటు తప్పకుండా మింగించాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగవేణి, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస రెడ్డి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, ఆరోగ్య పర్యవేక్షకులు విలియం, విజయలక్ష్మి, వైద్య సిబ్బంది కుమారి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ ప్రధాన కార్యదర్శిగా సుబ్బరాయుడు

ప్రొద్దుటూరు : ఆల్ ఇండియా లోకల్ బాడీ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా పోరుమామిళ్ల సుబ్బరాయుడును ఎన్నుకున్నారు. సోమవారం లక్నోలో జరిగిన మహాసభల్లో ఈయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.రామయ్య, మధు హర్షం వ్యక్తం చేశారు.

దోమల నియంత్రణపై అవగాహన

ప్రొద్దుటూరు క్రైం : దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భగత్‌సింగ్ కాలనీలో మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఈ శోభారాణి, సూపర్‌వైజర్ వరప్రసాద్, సీహెచ్‌ఓ నాగేంద్ర, ఆశా కార్యకర్త స్వర్ణలత, శ్రీవాణి పాల్గొన్నారు.

బి.కోడూరు : మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బి.కోడూరు గ్రామ పురవీధుల్లో వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ నాగవేణి, బద్వేలు తాలూక మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, ఆరోగ్య పర్యవేక్షకులు విలియం, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రొద్దుటూరు : విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మండలంలోని కల్లూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి నాగేంద్రారెడ్డి తెలిపారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ కుళ్లాయమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓ సావిత్రమ్మ, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, ఉపసర్పంచ్ నరేంద్రారెడ్డి పాల్గొన్నారు.

■ మున్సిపాలిటీ పరిధిలోని వసంతపేట మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ 17వ వార్డు పరిధిలోని నడింపల్లె మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు వార్డు కౌన్సిలర్ చింతకుంట సరితా రెడ్డి జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మండల ప్రత్యేక అధికారి వై.సురేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తాళ్లమాపురం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, ఎంఈఓ సావిత్రమ్మ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై.గోపీనాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎం.కొండారెడ్డి, ఉప సర్పంచ్ ఎం.శ్రీనివాసరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కానుకను సద్వినియోగం చేసుకోవాలి

రాజుపాళెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ చేస్తున్న జగనన్న విద్యా కానుకను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ప్రాథమిక, జెడ్పీ హైస్కూళ్లలోని 2364 మంది విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యా కానుకను పంపిణీ చేశారు. వెలవలిలోని జెడ్పీ హైస్కూల్‌లో నారాయణరెడ్డి, సర్పంచ్ మహబూబ్ బాష, హెచ్‌ఎం భాస్కర్, రాజుపాళెం సర్పంచ్ షాజియా, మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్, ఎంఈఓ వెంకటేశ్వర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.



ప్రొద్దుటూరు మండలం కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో జేవీకే కిట్లను అందిస్తున్న సర్పంచ్ శివలక్ష్మి నాగేంద్రారెడ్డి, అధికారులు



ప్రొద్దుటూరులోని వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో జేవీకే కిట్లను అందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

కలసపాడులో..

కలసపాడు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కలసపాడులోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో జెడ్పీటీసీ గురివిరెడ్డి, ఎగువ రామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ నారాయణయాదవ్ చేతుల మీదుగా విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. ఎగువ రామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో అధిక మార్కులు సాధించిన ఆర్.వి.వైష్ణవికి నాలి పుల్లారెడ్డి మెమోరియల్ ట్రస్టు తరఫున నాలి క్రిష్ణారెడ్డి రూ.10 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో లీడ్ క్యాప్ డైరెక్టర్ సుదర్శన్, ఎంపీటీసీ కుర్షీద్‌బేగం, సర్పంచ్ శివలీల, మాజీ ఎంపీటీసీ వీరారెడ్డి, పాఠశాల చైర్మన్లు రామయ్య, రసూల్, ప్రధానోపాధ్యాయులు కవిత, మెర్సీ మాలిని, నిర్మల, మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపవరం : మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుకల పంపిణీని అధికారులు ప్రారంభించారు. సోమవారం గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నాగమణి అధ్యక్షతన విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల ప్రత్యేకాధికారి నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, ఎంఈఓ చెన్నయ్యలు హాజరయ్యారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపవరంమల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ సరస్వతి, సర్పంచ్ వెంకటలక్షుమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బి.కోడూరు : మండలంలోని గోవిందాయపల్లె జెడ్పీ హెచ్ఎస్‌లో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.పుల్లయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగిల్‌విండో అధ్యక్షులు ఓ.ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం 2024 పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన మొదటి విద్యార్థికి రూ.10 వేలు, రెండవ విద్యార్థికి రూ.5 వేలు బహుమతులు అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షురాలు ఎస్.రామలక్షుమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కలసపాడు: కిట్‌ను అందజేస్తున్న జెడ్పీటీసీ గురివిరెడ్డి

పోరుమామిళ్ల : విద్యా వ్యవస్థలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అనేక మార్పులు తీసుకువచ్చారని, అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ముందుకు దూసుకుపోతోందని జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రంగసముద్రం పంచాయతీ మహబూబ్‌నగర్ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు వారు జగనన్న విద్యాకానుకను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రఘురామిరెడ్డి, ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఎంపీడీఓ నూర్జహాన్, తహసీల్దారు గంగయ్య, ఎంపీటీసీ మహబూబ్‌పీరా, ఎస్ఎంసీ చైర్మన్ విజయభారతి, హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగ్గురు హెచ్ఎంలు బదిలీ

రాజుపాళెం : సాధారణ బదిలీల్లో భాగంగా గాదెగూడూరు, తొండలదిన్నె, టంగుటూరు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని హెచ్ఎంలు బదిలీ అయినట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. బదిలీ అయిన స్థానాల్లో కొత్తగా వచ్చిన హెచ్ఎంలు బాధ్యతలు స్వీకరించారని చెప్పారు. అర్కటవేముల పీడీ అంకారావు దువ్వూరు మండలంలోని పుల్లారెడ్డిపేటకు బదిలీ కాగా, మండలంలోని ప్రాథమిక పాఠశాలలో 20 మంది, జెడ్పీ హైస్కూల్‌లో 25 మంది ఉపాధ్యాయులు బదిలీ అయినట్లు తెలిసింది. వారి స్థానాల్లో సోమవారం కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు.

హైవే భూ బాధితులకు 14న సమావేశాలు

చాపాడు : మండలంలోని బెంగళూరు-విజయవాడ గ్రీన్ ఫీల్డు ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారిలో భూములు కోల్పోయే భూ బాధితులకు ఈ నెల 14న గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు సుభానీ తెలిపారు. 14న ఉదయం 10.30 గంటలకు అల్లాడుపల్లె గ్రామ సచివాలయం, మధ్యాహ్నం 12కు బద్రిపల్లె గ్రామ సచివాలయం, 3కి సోమాపురం గ్రామ సచివాలయాల వద్ద గ్రామ సభలు జరుగుతాయన్నారు. భూములు కోల్పోయిన రైతులు తమ పొలం తాలూకు డాక్యుమెంట్లు, 1బి, అడంగల్, ఈసీ, లింక్ డాక్యుమెంట్ పత్రాలతో సభకు హాజరు కావాలని ఆమె కోరారు.

22న యువ ఉత్సవ్

కడప స్పోర్ట్స్ : ప్రొద్దుటూరు పట్టణంలోని సీబీఐటీ కళాశాలలో ఈనెల 22న భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి 'యువ ఉత్సవ్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి కె.మణికంఠ తెలిపారు. ఈ యువ ఉత్సవ్ కార్యక్రమంలో 'పంచ్ ప్రాణ్ ఆఫ్ అమ్రిత్ కాల్' అన్న అంశంపై పెయింటింగ్, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లేమసిన్ విభాగాల్లో వ్యక్తిగత, గ్రూప్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల వారు ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

మైనార్టీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

రాజుపాళెం : మైనార్టీల అభివృద్ధికి ఎల్లవేళలా కట్టుబడి ఉంటామని, ఆ ప్రకారం మసీదును అన్ని హంగులతో నిర్మించి తీరుతామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. సీఎం డీఎఫ్ రూ.36 లక్షల నిధులతో సోమవారం మండలంలోని కొర్రపాడు గ్రామంలో మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు, మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, మత గురువులు టెంకాయలు కొట్టి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మత గ్రంథాల్లో రాసిన బోధనలు మనిషి జీవితాన్ని సరైన మార్గంలో నడిపిపేందుకు ఉపకరిస్తాయన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే కోటా కింద ఇచ్చిన నిధులను ఈ మసీదు నిర్మాణానికి కేటాయించామని తెలిపారు. సూఫీల మత గురువు అబ్దుల్ ఖాదర్ స్వామి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే తన సొంత నిధులు కోటి రూపాయలు ఇవ్వడం రాచమల్లు దాతృత్వానికి వెల కట్టలేమన్నారు. పీఆర్ డీఈ మల్లేశ్వర రెడ్డి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, పార్టీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, వెలవలి శేఖర్‌రెడ్డి, ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొర్రపాడులో మసీదు భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు, నాయకులు, మత గురువులు

ప్రజా సమస్యల పరిష్కారానికే 'స్పందన'

పోరుమామిళ్ల : నిత్యజీవితంలో ఎదురవుతున్న అనేక సమస్యలకు స్పందన సరైన వేదికని రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రంగసముద్రం సచివాలయం – 2లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలకు ప్రజలు తహసీల్దారు, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థలో అధికారులే సోమ, గురువారాల్లో స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, తహసీల్దారు గంగయ్య, ఎంపీడీఓ నూర్జహాన్, వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరయ్యారు.

గోపవరం : స్పందనలో వచ్చే ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారించాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాచాయపేట సచివాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



భూ సమస్యపై అర్జీ ఇస్తున్న వ్యక్తి

కాశినాయన : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే స్పందన కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంపీడీఓ ముజఫర్ రహీమ్, తహసీల్దారు రామచంద్రుడు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కత్తెరగండ్ల సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం ఏర్పాటు చేశామని, ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని మండల విద్యాశాఖాధికారి కార్యాలయ అధికారికి ఎస్టీఎఫ్ నాయకులు వినతిపత్రమిచ్చారు. ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఐదు స్కూళ్లు మూతపడిన కారణంగా వాటిలో పనిచేస్తున్న 14 మంది ఉపాధ్యాయులతోపాటు మిగిలిన స్కూళ్లలో సర్‌ప్లస్‌గా ఉన్న ఉపాధ్యాయులను అవసరమైన చోట సర్దుబాటు చేయాలని కోరారు. మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ పట్టణాధ్యక్షుడు వినోద్, నాయకులు రామ్మోహన్, నరేష్, జాకీర్, శివరామయ్య, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.



ఎంఈఓ కార్యాలయ అధికారికి వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్టీఎఫ్ నాయకులు

సచివాలయ సిబ్బంది సమయం పాటించాలి

కలసపాడు : సచివాలయ సిబ్బంది సమయం పాటించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కలసపాడు, మహానందిపల్లె గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయాలను నిర్మించారన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ 3 నుంచి 5 గంటల వరకు సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహానందిపల్లె సచివాలయంలో 12 సిబ్బంది ఉండగా సోమవారం నలుగురు మాత్రమే ఉన్నారని, ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఒకవేళ ఏదైనా పని ఉంటే ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ అనుమతి తీసుకోవాలన్నారు. అలా చేయని పక్షంలో వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వీరారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న నాగార్జునరెడ్డి

సీఎం ఆశయం నెరవేర్చండి

మైదుకూరు : పేద వాళ్లందరూ బాగా చదువుకొని ఉన్నత స్థానాల్లో ఉండాలనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని, విద్యార్థులందరూ ఆయన ఆశయాన్ని నెరవేర్చాలని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అన్నారు. మైదుకూరు జెడ్పీ హైస్కూల్ (బాలురు)లో సోమవారం జగనన్న విద్యా కానుక పంపిణీ జరిగింది. మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డితో కలసి మున్సిపల్ చైర్మన్ విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాడు–నేడు కార్యక్రమంతో సీఎం తీర్చిదిద్దారని అన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్ట్, బూట్లు, జగనన్నగోరుముద్ద పేరుతో పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ పద్మలత, బాలుర హైస్కూల్ హెచ్ఎం గంగాభవాని, విద్యాకమిటీ చైర్మన్ ఫజుల్, సీఆర్‌పీ విశ్వం, ఉపాధ్యాయులు బాలగంగాధర్, సూర్యనారాయణ రెడ్డి, మణిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత

చాపాడు : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక గూడూరు అప్పయ్య గారి సుబ్బరాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలు, విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం వేలాది కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. పేద పిల్లలను ప్రతి తల్లిదండ్రులు చదివించుకోవాలనే ఉద్దేశంతో అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు ఇస్తున్నారన్నారు. అనంతరం జెడ్పీటీసీ జేష్టాది రాజి, తహసీల్దారు సుభానీ, ఎంఈఓ రవిశంకర్, గ్రామ సర్పంచ్ చింతకుంట మహబూబ్ బీల చేతుల మీదుగా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గౌస్ మొహిద్దీన్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుబ్బరాయుడు(బాబ్జీ), ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొర్రాయిపల్లెలో పంపిణీ చేసిన సర్పంచ్..

మండలంలోని మొర్రాయిపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి ముఖ్య అతిథిగా ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ

దువ్వూరు : దువ్వూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 3,859 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఓబులేసు, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, తహసీల్దార్ రమకుమారి, సర్పంచ్ దండు చెంద్రాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మైదుకూరు : జేవీకే కిట్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్ర



దువ్వూరు : జేవీకే కిట్లను అందిస్తున్న ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి

ఆలయ భూముల వేలం

దువ్వూరు : ఇడమడక గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీచెన్నకేశవ ఆలయ భూములకు ఆలయ కమిటీ చైర్మన్ నగరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం వేలం పాట నిర్వహించారు. 139 ఎకరాలు ఏడాదికి కౌలుకు వేలం పాట నిర్వహించగా 49 మంది రైతులు రూ.7,52,200లకు పాడి దక్కించుకున్నారని దేవదాయ శాఖ ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ వేలంలో ఉప్పలూరు, ఇడమడకకు చెందిన రైతులు పాల్గొన్నారని ఆయన చెప్పారు.


గ్రామాల్లో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కొత్తపల్లె, ఖాదర్‌బాద్ గ్రామాల్లో సోమవారం ఆరవ విడత జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ రీసెర్చ్ అధికారులు జీవీ ఉదయ్‌కుమార్, వంశీ, రాజు సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో అమలు చేస్తున్న కుటుంబ నియంత్రణ, మాతాశిశు సంరక్షణ, పౌష్టికాహారం, రక్తహీనత, వ్యాధినిరోధక టీకాలు, తాగునీరు, పారిశుధ్యం తదితర సేవలపై ఇంటింటికి తిరిగి పరిశీలించారు. కల్లూరు పీహెచ్‌సీ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, సీహెచ్‌ఓలు ప్రశాంత్, రోజావతి, ఏఎన్ఎంలు చెన్నకేశవమ్మ, జ్యోతి, శోభారాణి, కేజియా, ఆశా కార్యకర్తలు సునీత, అమరావతి, లక్ష్మీసుధ, అన్నమ్మలు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

ప్రొద్దుటూరు : సమాజంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని సీనియర్ న్యాయవాది ముడిమెల కొండారెడ్డి తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని కోరుతూ మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు సోమవారం ఐసీడీఎస్ అర్బన్, రూరల్ ప్రాజెక్టుల పరిధిలోని కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు ఎం.రమేష్‌కుమార్, లక్ష్మీదేవి, లేబర్ ఆఫీసర్ పావని, సీడీపీఓ హైమావతి, సూపర్‌వైజర్లు ఈశ్వరి, నాగేశ్వరి, రఫియా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపాడు : బాల కార్మిక వ్యవస్థను అందరూ కలసికట్టుగా నిర్మూలించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, ఇందిరా క్రాంతి పథం ఏపీఎం వెంకటరమణ పేర్కొన్నారు. మండల పరిధిలోని బద్రిపల్లెలో సోమవారం ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు అనాథ పిల్లలను మాదక ద్రవ్యాల విక్రయానికి, కొనుగోలుకు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించేందుకు ఉపయోగించుకుంటున్నారన్నారు. మరికొంత మంది బాలలను నిషేధిత కర్మాగారాలలో పనిలో పెడుతున్నారన్నారు. ఈ వ్యవస్థ నిర్మూలన కోసం ముందు తల్లిదండ్రుల్లో మార్పు రావాలన్నారు. పసి పిల్లలను బడికి కాకుండా పనికి పంపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలపై తాత్కాలిక ఆర్థిక ప్రయోజనం ఆశించకూడదన్నారు. బాగా చదువుకోవాలని పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించిన నాడే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అవుతుందన్నారు. ఈ సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మ్యాగీ, గ్రామ సచివాలయ, డ్వాక్రా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు, ఐసీడీఎస్ అధికారులు



మానవహారంలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పోరుమామిళ్ల : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తామని అంగన్‌వాడీలు ప్రతిజ్ఞ చేశారు. సోమవారం సాయంత్రం సీడీపీఓ కార్యాలయం నుండి ఆర్టీసీ బస్టాండు వరకు అంగన్‌వాడీ వర్కర్స్, ఆయాలు, సూపర్‌వైజర్స్ ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవ సందర్భంగా ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు, బాల్యవివాహాల నిరోధానికి, బాలికల అక్రమ రవాణా అదుపునకు, బాలబాలికలపై జరుగుతున్న హింస, దోపిడీ, అత్యాచారాలను అడ్డుకునేందుకు కృషి చేయాలన్నారు.

మైదుకూరు : బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత సమాజంలో అందరిపైనా ఉందని ఐసీడీఎస్ మైదుకూరు ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని సోమవారం సాయంత్రం మైదుకూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు తదితరులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ సమాజంలో బాల కార్మిక వ్యవస్థ వల్ల అనిశ్చిత పరిస్థితి నెలకొంటుందని, ఈ వ్యవస్థను నిర్మూలిస్తే పిల్లలు బాగా చదువుకొని భావి భారత పౌరులుగా మారుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, శ్రీదేవి, రమాదేవి, ప్రశాంతి, భారతి, డీసీపీయూ ప్రతినిధి లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని మండల లీగల్ సర్వీస్ కమిటి చైర్మన్ జీఎస్ రమేష్‌కుమార్ తెలిపారు. బాల బాలికల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం మున్సిపల్ ఉర్దూ పాఠశాల నుంచి శివాలయం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల లీగల్ సర్వీస్ కమిటి చైర్మన్ మాట్లాడుతూ మన దేశంలో ఎందరో బాలబాలికలు ఆట పాటలకు, చదువులకు దూరంగా ఉంటున్నారన్నారు. చట్ట ప్రకారం దుకాణాలు, సంస్థల్లో 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోరాదన్నారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠినమైన శిక్షలు విధిస్తారని చెప్పారు. లేబర్ ఆఫీసర్ పావని, ఐసీడీఎస్ సీడీపీఓ హైమావతి, చిల్డ్రన్స్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత, సీనియర్ న్యాయవాదులు ముడిమేల కొండారెడ్డి, ఎం రమేష్‌కుమార్, లక్ష్మీదేవి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.